# మోసులు ఎండిపోతున్నాయ్



గంగాధరం బావిగట్టున నిలబడ్డాడు.

మట్టికడుపులో విత్తును మొలకెత్తించడంలో కాయలు గాచిన అతని చేతులు ఇప్పుడు నెత్తిమీదికొచ్చాయి. ముదురు మొగంలో అలిసిన కండ్లల్లో అగ్గి కురుస్తా ఉంది. బక్కపలచని ఆకారంతో గాలికూడా వేళాకోళమాడుతున్నదేమో అన్నట్లు మనిషి వెనక్కూ ముందుకూ ఊగిపోతున్నాడు. ఊగుతూనే బావిలోకి తొంగి చూస్తాడు. చూస్తూ నిట్టూరుస్తాడు. నిట్టూరుస్తూ తల పైకెత్తి పొలంవైపు చూస్తాడు. మోసులెత్తి నవనవలాడుతున్న చెరకుతోట. గాలి తాకిడికి ఉల్లాసంగా ఊగుతూ ఉంది. చూడగానే గుండెల్లో ఎక్కడో నిరాశ ములుకై కెలుకుతుంది. 'ఇంకనేనేం చేసేదిరా దేవుడో?' అంటూ ఏడుస్తాడు.

"ముదుపులకు రాళ్ళు కరగనట్లే... ఏడుపులకు మేఘం కురవదు".

రాళ్ళసీమలో అది ఏడుమట్ల బావి. ఎప్పుడో తాతముత్తాతల కాలంలో పుడమితల్లిని గడ్డపారలతో తవ్వితవ్వి ఎదురు తిరిగిన రాళ్ళను నాట్లుపెట్టి చీల్చిచెండాడి పాతాళగంగను

పైకితెచ్చే భగీరథ ప్రయత్నంలో రూపులు దిద్దుకొన్నబావి. తనకు బుద్ధితెలిసిన నాటినుండి ఆ బావి రెండు మూడేండ్లు వర్షాలు పడినా పడకున్నా ఎండిపోలేదు.

"ఒరే గంగాధరం! నీకేమిరా? నీపేరు బలంమీదనే నీకు బాయిగూడా అమిరినట్లుండాది. మా బావులన్నీ అడుగంటి పొయ్‌నా నీ బాయిలో మాత్రం నీళ్ళు ఒక్కచుక్కైట్టా తగ్గలేదు. అదురుష్టమంటే అట్టుండాల్రా!" అని వీళ్ళూ వాళ్ళూ దారిలో ఎదురుపడి అంటూ ఉంటే అతడి గుండె గుమ్మడికాయంత అయ్యేది.

అప్పటికి చినుకు నేల రాలి మూడు నాలుగేండ్లు అయింది. చెరువులు ఎండిపోయాయి. వంకలూ వాగులూ ఇసుకతేలిపోయాయి. చెట్లూ చేమలు రెక్కలు తెగిన పక్షుల్లా విలవిల లాడుతున్నాయి. మేఘాలు కానరాని దేశాలకు వలసపోతే ఆకాశం కడిగితోసినట్లుంది. అయినా తన బావి తనను మోసం చేయదని నమ్మి మూడు ఎకరాలు చెరకు నాటడానికి ఏర్పాటు చేసుకొంటున్నాడు.

అప్పుడు ఎదురింటి ఏకాంబరం...'గంగా! దేనికైనా మంచిది కొంచెం ఆలోచించుకోరా' అన్నాడు.

"ఒరే! ఎవుర్రా మిమ్మల్ని వక్కాకుపెట్టి పిల్చింది. పాయాస్నంతా పరుల పాల్జేసి ఉపాయాన్ని పట్టుకొని ఊగులాడే యదవ అనుకుణ్ణారా నన్ను? నేనేందిరా ఆలోచించుకుండేది" అన్నట్లుగా ఒక్క చూపు విసిరాడు గంగాధరం.

ఆ చూపుల్లో నిర్లక్ష్యం తొంగితొంగి చూస్తూ ఉంది.

"గంగా! నీది ఏడుమట్లబాయి. మేము కాదనలా. ఎప్పుడూ అడుగంట్లా. నిజిమే. అయితే పైగుడ్డ తడ్సే చినుకులు పడి ఎన్నాళ్ళయిందో నువ్వే చెప్పు. తాగే నీళ్ళకే తనకలాడ్తా ఉండాం. ఇంక మూడెకరాల తోటకు తడిపడేదంటే మాట్లా? దేనికైనా మంచిది. బాగా ఆలోచించుకొని దిగు. కాదంటావా? నీ యబ్బతోడు."

ఎదురింటాయన మనసులో మాటకు ముసుగేయలేక పోయాడు. సమయాసందర్భాల్లో సాటి రైతుకు ఆమాత్రం కలగచేసుకొని చెప్పడం సహజమే. అయితే ఆ మాటలు గంగాధరం చెవికెక్కలేదు. తన ప్రయత్నంలో తానుంటే...

"నీపట్టే నీదికానీ బతుకంటే పట్టిడుపులు లేకపోతే ఎట్ట మామా? బాయిలో నీళ్ళు ఒకయిడుగోలుకుంటే ఇంగొక్క యిడుగోలుకు అడుగంటిపోతా ఉండాయి. చెరుకంటే ఈ చేత్తో నాటి ఆ చేత్తో కోసుకుండే పంటకాకపాయ. ఏడాది పొడగనా తడి పడాల్సిందే గదా? ఇప్పిటికే అమ్మి పెండ్లికి చేసిన అప్పు తీరకుండా అల్లాడ్తా ఉండాం. ఇంక కయ్యి అరువు చేసుకుండే దానికనీ...చెరుకు యిత్తనానికనీ... ఎరువులకనీ!..." అంటు ఇల్లాలు ఏకరువు పెడ్తా ఉంటే ఆమె కండ్లు నిండుకున్నాయి.

అది గమనించిన గంగాధరం "చాల్చాలు. నిలుపే నీ దండకం. మొగోడు ఒక్కడుగు ముందుకెయ్యాలంటే కొంపలో ఆడది పట్టి ఏడడుగులు ఎనిక్కి లాగతాఉంటే ఇంకెట్నే ఈ

కొంప రతికెక్కేది? ఇప్పుడు మంచీ చెడ్డా చెప్పమని వక్కాకుపెట్టి అడిగిన నాకొడుకు ఎవుడే నిన్ను" అంటూ ఇల్లాలి మీద విరుచుక పడ్డాడు.

ఆడది అంటే అబల అన్నఅభిప్రాయం నరనరాల్లో జీర్ణించుకుపోయిన ఆ ఇల్లాలికా సాధింపులకు సమాధానం దొరకలేదు.

బావిలో నీటిమట్టం దినదినానికి తీసికట్టుగానే ఉంది.

అయినా గంగాధరం అధైర్యపడలేదు.

ఒక్క పూటంతా కరెంటు మోటార్ వెయ్యకుండా నిలిపితే ఒక్క మట్టుకు అటోయిటోగా నీళ్ళూరుతున్నాయి. అది గమనించిన గంగాధరం గుండెల్లో ఆశలు మోసులెత్తాయి.

ఆ నీళ్ళ తోడి తడవకు కొంత నేలతడిపాడు. తడిపిన నేల పదునుమీద ఉండగానే మడకలు కట్టి దున్ని దుక్కిచేస్తున్నాడు. ఇక్కడ దుక్కి దున్నుతూ ఉంటే అక్కడ బావిలో నీళ్లూరుతున్నాయి. దుక్కి అయ్యేలోపల బావిలో ఊరగలిగినన్ని నీళ్ళు ఊరుతూనే ఉన్నాయి. ఇలా కొంతకొంతగా నేలను తడిపి దున్నుతూ వారాలు తిరగకముందే మూడు ఎకరాలు దుక్కిచేశాడు.

"ఇడుపు యిడుపుకూ ఈ మాత్రం నీళ్ళూరితే చాలు. ఆమిందట దేవుడ్తో అయినా పోట్లాడుకోవచ్చులే". అని ధైర్యం తెచ్చుకొన్నాడు గంగాధరం.

ఆ ధైర్యంతోనే అప్పో సప్పో చేశాడు. విత్తనం చెరకు కొన్నాడు. ఎరువులు కొన్నాడు. ఆ ఎరువును దుక్కిమీద పలచగా చల్లించాడు. తిరుగుచాలు తోలించాడు.

పత్తిపువ్వు మాదిర మెత్తంగా తీరింది దుక్కి

అప్పుడు బోదెలు తోలి చెరకు నాటించాడు.

ఆరోజునుండి ఇల్లూవాకిలీ బావిగట్టే అయింది– గంగాధరానికి. బావిగట్టు మీద కూర్చుంటాడు. కండ్లల్లో ఆశలపూలు పూస్తుంటే బావితట్టే చూస్తుంటాడు. ఒక్క విడుపుకు ఊరగలిగినన్ని నీళ్ళు ఊరితేచాలు. ఎగిరిగంతేసి మోటార్ వేస్తాడు. పారచేతపట్టుకుంటాడు. తోటపారినంత మేరకు తడివేస్తాడు. మళ్ళీ వచ్చి బావిగట్టున కూర్చుంటాడు. బావి తట్టే చూస్తూ!... అంతకుమించి తనకేమీ పనిలేనట్టుగా! తన పంచప్రాణాలు ఆ తోటే అయినట్టుగా!!

నాటిన చెరకు మొలకెత్తింది. మొలకెత్తిన చెరకు మోసులు వేసింది. మోసులు వేసిన తోట గణుపెక్కి నవనవలాడుతూ గంగాధరం పంచవన్నెల ఊహలకు ప్రాణం పోస్తూఉంది.

పొంగిన ఆనందంతో రెప్పలిప్పుకొని గంగాధరం గర్వంగా తోట తట్టుచూస్తూ నిలబడతాడు.

"హుం! యదవన్నర యదవలు. గెడ్డివామికాడ కుక్కలు గదావీళ్ళు. నన్నే ఎనికి తొక్కులు తొక్కించాలనుకున్నారు? నేనెటుమంటోణ్ణి. పట్టుకుంటే ఉడుంపట్టేగదా? నిగిడి నిగిడి నీతులు చెప్పిన మొగలాయిలు ఇప్పుడు వచ్చి చూస్తే గదా తెల్సేది!!" అని గంగాధరం లోలోపల పొంగిపోతున్నాడు. కానీ పైకి పొక్కడంలేదు.

చూస్తూ చూస్తూ ఉండగానే చెరకు నాలుగైదు గణుపులు వేసింది. సోగలు సోకులు పోతున్నాయి. ఆకుపచ్చ రంగులో అంత నీలంరంగు కలిపి మూడెకరాల పొలం మీద కుప్పపోసి ఆ కుప్పను చదర కట్టినట్టు చెరకు తోట నీలాలు పారుతూ కనులపండువుగా ఉంది.

ఇప్పుడు ఆ దారిలో వస్తూపోతున్న వాళ్ళ కండ్లన్నీ ఆ తోటమీదే.

గంగాధరం గమనించాడు.

"ఏ యాళకు ఎట్లుంటుందో ఏం పాడో? ఏ దిష్టికన్నయినా నా తోట మింద పడ్తే..."

అనుమానం ప్రాణసంకటం. గంగాధరం మనసు విలవిలలాడింది. ప్రాణానికి ప్రాణంగా కాపాడుకొంటున్న తోట. సాగని కాలువలో బొట్లు బొట్లుగా చెమటను కలిపితే ఆ మాత్రం కంటికి పచ్చగా కనిపిస్తున్న తోట. అమ్మో! ఏ పాపిష్టి కండ్లల్లో అయినా పడ్తే...?

ఆ తర్వాత గంగాధరం ఒక్క క్షణం ఆలస్యం చేయలేదు. పాతచట్టిని తీసుకొన్నాడు. గుడ్డపేలికతో శుభ్రంగా తుడిచాడు. ఆ చట్టికంతా సున్నంపూత పూశాడు. ఆరిన తరువాత దాని మీద సందులేకుండా మసిబొట్లు పెట్టాడు. చెరకుతోటలో ఒక పొడవైన వెదురుగుంజను నాటి దిష్టికుండను దానిమీద బోర్లించాడు.

అయినా చెరకుతోటకు దిష్టికొట్టనే కొట్టింది.

ఎప్పుడూ అడుగంటని బావి అడుగంటింది.

కొండంత ఆశను మూటగట్టుకొన్నగుండె ముక్కలైంది.

అందుకే ఆ బావిగట్టున నిలబడి అడుగంటిన బావిని చూస్తూ "ఇంక నేనేం చేసేదిరా దేవుడో?" అని నెత్తిమీద చేతులు పెట్టుకొని 'బోరో'మని ఏడుస్తున్నాడు.

ఆ ఏడుపును నిర్దాక్షిణ్యంగా కాకులూగద్దలూ తన్నుకొని పోతున్నాయి.

బావిలో చుక్కనీళ్ళు ఊరలేదు.

చుక్కలు చుక్కలుగా కన్నీళ్ళు కార్చినా చుక్కనీళ్లూరని బావిని.... మిసమిసలాడుతూ మింటిని చూస్తున్న తోటను మార్చి మార్చి చూస్తాడు. నిట్టూరుస్తాడు. ఇంకనేనేమి చేసేదిరా దేవుడో? అని గుండెలు బాదుకుంటాడు.

అప్పుడు గంగాధరం మనస్సులో ఒక వ్యక్తి మెదిలాడు. అతడికి వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్లయింది. బావిగట్టుమీద నుండి ఎగిరి కిందికి దూకాడు. నడక పరుగ్గా ఊరిముందర చింతచెట్టు కిందికి చేరాడు.

ఆ చింతచెట్టు కింద రెక్కల ముడుచుకొని పొదిగిన కోడిపెట్టలా మూడు అంకణాల పూరిల్లు. ఆ కోడిపెట్ట రెక్కలకింద పొదిగిన పిల్లల్లా పిల్లలు. ఆ బడి పిల్లలకు అయిదు తరగతులకూ కలిసి ఒకే ఒక ఉపాధ్యాయుడు.

ఆ ఉపాధ్యాయుడికి తల్లిదండ్రులు పెట్టిన పేరు వెంకటాచలం.

ప్రభుత్వం పెట్టిన పేరు సింగిల్ టీచర్!

అతనిది నిండునదిలాంటి గుండె. ఎదుటి మనిషి కష్టం తనకష్టంగా భావించే మనస్తత్వం. అందుకే పిల్లలకు చదువు చెప్పడం ఒక ఎత్తయితే ఊరి సమస్యలను తలకెత్తుకోవడం ఇంకొక ఎత్తుగా ప్రవర్తిస్తున్నాడు. ఎవరికి ఏ కష్టం కలిగినా 'అయ్యోరుండాడులే!' అన్న నమ్మకం పైరగాలి పాటగా గుండెగుండెను పరవశింపచేస్తూ ఉంది.

గంగాధరం చింతచెట్టుకిందికి చేరేటప్పటికి వెంకటాచలం ఒకటో తరగతి పిల్లలకు 'కల', 'వల' పదాలు నేర్పుతున్నాడు. గస పోసుకుంటూ బడిముందు నిలబడిన గంగాధరాన్ని గమనించాడు. చెబుతున్న పాఠాన్ని నిలిపి కుర్చీలోనుంచి లేచాడు. గబగబా గంగాధరం వద్దకు నడిచి, అతడి భుజంమీద చెయ్యివేస్తూ. 'ఏం జరిగింది గంగాధరం?' అంటూ ఆతురతగా అడిగాడు.

గంగాధరం నోరు విప్పాలంటే గస. అంగుటికి అంటుకపోయిన నాలుక. చెప్పాలన్న తాపత్రయం...చెప్పలేని నిస్సహాయతలమధ్య నలుగుతూ ఉనికిని పోగొట్టుకొన్న గొంతు!

వెంకటాచలం గ్రహించాడు.

"ఒరే గోపీ! కొంచెం నీళ్ళు తీసుకురారా!" అన్నాడు.

"కుండలో నీళ్ళు ఖాళీ సార్!" అంటూ బదులు.

బావిలో నీళ్ళులేవు. కుండలో నీళ్ళు లేవు. గంగాధరం గుండె మాత్రం కరిగిన మేఘమైంది. కన్నీళ్ళ జొన్నగింజలు పలపల నేలరాలాయి.

వెంకటాచలం మనస్సు చివుక్కుమనింది.

"చూడు గంగాధరం. కష్టాలు మనుషులకే వచ్చేది. ఆ కష్టాలను ధైర్యంగా ఎదుర్కోవాలే కాని ఇలా దిగజారిపోతే ప్రయోజనం? కన్నీళ్ళతో కష్టాలు తీరుతాయా? ఏం జరిగిందో చెప్పు. ఏమి చేయాలో ఆలోచిద్దాం."

"ఏమి ఆలోచించి మాత్రం ఇంక ఏం చెయ్యబోతాం అయ్యోరా!... నా కీనీరు బాయే ఎండిపాయనే."

"ఎప్పుడూ అడుగంటని బావి ఎండిపోయిందా."

"అవును! అయ్యోరా అవును!" అని చెప్పడానికి నోరాడక తనలో తానుగా కుములుతున్న గంగాధరాన్ని ఒక్క క్షణం రెప్పార్పకుండా చూశాడు.

ఆ చూపుల్లో దీనత్వం... ఆ కండ్లల్లో కరుడుగట్టిన దీనాకృతి కంటెదుట నిలబడినట్లుంది. చిగురిస్తున్న బతుకును చిచ్చుమింగినపుడు నాలుగు సానుభూతి మాటలు పుండుమింద పూతలా పనిచేస్తాయని వెంకటాచలానికి బాగాతెలుసు.

"దీనికే ఇంత బెంబేలు పడిపోతే ఎలా గంగాధరం?" అన్నాడాయన.

"ఇంక ఏం చెయ్యమంటావ్ చెప్పు అయ్యోరా! ఒక్క దినమా? రొండు దినాలా? అయిదారు నెలలే. బాయికాడనే కాపరం పెట్టినే? కంటికి రెప్పగా కాపాడుకుంటినే. 'ఉణ్ణిందీపాయ,

ఉంచుకున్నిందీ పాయ' అన్నెట్టుగా బతుకు బయిశాట్ల పాలాయనే. అంతో యింతో చేతిలో ఉన్నిందీ... ఆడాయీడా చెయ్‌బొదులుగా తెచ్చుకున్నిందీ... అంతా పాయనే. బూడిదలో పోసిన పన్నీరైపాయనే. అయ్యోరా! ఇంగొక్క రెండు మూడు నెలలు బాయి మోసం చెయ్యకుండా ఉన్నుంటే చేతికందినపైరు నోటికందునే? ఇప్పుడు నన్నేం చెయ్యమంటావ్ చెప్పు అయ్యోరా చెప్పు?"

ఎగదన్నుకొస్తున్న ఏడుపును బిగపట్టుకోలేక పైగుడ్డ మడిచి నోట్లో దురుక్కొని కుమిలికుమిలి ఏడుస్తున్నాడు గంగాధరం.

వెంకటాచలం గుండె కరిగి కనుకొనల్లో తొంగిచూసింది. అయినా తమాయించుకొన్నాడు. "గంగాధరం! నువ్వేమీ దిగులు పడద్దు. నీ పంట నీచేతికందుతుంది. నా మాట నమ్ము " అన్నాడు ఎంతో ధీమాగా.

"నువ్వు చెప్పేది మరీ ఇచ్చిత్రంగా ఉందాదే? ఇంకకూడా నీ మాట నమ్మమంటావా? బాయిలో నీళ్ళే లేకుండాబోతే ఇంక పంటెట్టా చేతికొస్తింది? పలకమీద అచ్చిరాలు రాసి తుడిపేసినంత సులువుగా చెప్తావుందావే?" అన్నట్టుగా అయోమయంగా చూస్తున్నాడు గంగాధరం.

ఊతమివ్వాలన్న ఉబలాటం కెరటమై పెదాలను తాకితే వెంకటాచలం–

"గంగాధరం! ప్రభుత్వం ఈ సీమ పరిస్థితిని గమనించి ఇన్‌వెల్ బోర్స్ పథకాన్ని ప్రవేశపెట్టింది. అంటే నీళ్ళు ఇంకిపోయిన బావుల్లో గొట్టం బావులు వేయిస్తారు. అరవై అడుగులు లోతు వరకు ఉచితంగానే వేస్తారు. అంతకు పైబడితే ఎంతో కొంత డబ్బు కట్టవలసి వస్తుంది. నీది కీనీరు బావికదా? అరవై అడుగుల లోపుగానే నీళ్ళు పడతాయి. నీ పంట నీచేతి కందుతుంది. నువ్వేమీ దిగులుపడవద్దు."

"ఇదంతా అయ్యోపనేనంటావా అయ్యోరా!"

"ఎందుకు కాదు?"

అంత బాధలో కూడా వేదాంతిలా నవ్వాడు గంగాధరం.

"ఆ నవ్వులోనే నీ బాధ... నీ సందేహం కూడా అర్థమవుతున్నాయి గంగాధరం! అరటి మొక్కకు నీళ్ళు పెడ్తే పక్క పక్కనే మోసులు వేస్తాయి. సందేహాన్ని సాగదీస్తూ కూర్చుంటే సవాలక్ష అవుతాయి. అది మంచిపద్ధతి కాదు. ఇప్పటి నీ పరిస్థితి ఎవరైనా అర్థంచేసుకుంటారు. అవసరమైన విధంగా ఆదుకుంటారు కూడా!"

"అయ్యోరా! నెమిలికంట్లో నీళ్ళు గార్తే వేటగాడికేమైనా ముద్దా? అందురూ నీ మాదిరి మంచోళ్ళే ఉంటారనుకుంటే అది నీ పిచ్చి. నా అనుబోగంలో చెప్తా ఉండా యిను. వాడు రైతు బిడ్డయినాసరే. పాయ్ ఆ కుర్చీ మింద కూసున్నాడంటే వాడు ఎక్కణ్ణుంచి వచ్చిందీ మర్చిపోతాడు. రౌతై రైతు మిందనే సవారిచేస్తాడు. తెల్లోడి ప్రెబుత్వంలో బతుకులు అట్ట తెల్లారిపోతే, ఇంక మనోళ్ళకత ఎట్టుండాదంటే?–మోసుల్లోనే చీడగొట్టేస్తా ఉండాది."

"నీ మాట నేను కాదనడంలేదు. అయితే అందరూ అలానే ఉంటారని ఆలోచించడం కూడా తప్పేగదా? కాబట్టి నువ్వు వెళ్ళి విలేజ్ అసిస్టెంట్‌ను కలువు. అతని సహాయంతో రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ని చూడు. వీళ్ళిద్దరూ తలుచుకుంటే మండలాధికారి పని ఏముంది? సంతకం పెట్టేవరకే కదా? అప్పుడా కాగితాలను కలెక్టర్ ఆఫీసుకు కదిలిస్తే ఆ తర్వాత జరగవలసిన పనులు వాటంతటవే జరిగిపోతాయి. నీ బావిలో గొట్టంబావి పడుతుంది. నీ పంట నీచేతికందుతుంది. నువ్వేమీ దిగులు పడద్దు. వెళ్ళు." అంటూ వెంకటాచలం గంగాధరం భుజంతట్టి వదిలాడు.

ఆ ఊపు మీద బయలుదేరాడు గంగాధరం. కాలికి బలపం కట్టుకొని తిరిగాడు. వల విసిరినట్టుగా విలేజ్ అసిస్టెంటును పట్టుకొన్నాడు. పట్టుబట్టి ఇంటికి పిలుచుకొని వచ్చాడు. కూతకొచ్చిన కోడిపుంజును కోశాడు. ఇల్లాలు కోడిమాంసంతో విందుభోజనం తయారుచేస్తుంటే గంగాధరం మనిషిని పంపించి మందు తెప్పించాడు. కొసిరి కొసిరి తాగించాడు.

విలేజ్ అసిస్టెంటు ఇంటి అల్లుడి హోదాలో విందుభోజనం ఆరగించాడు. నడవలో నులకమంచం మీద నడుం వాల్చాడు. గుర్ గుర్ మన్న శబ్దంతో గంగాధరం ఇంటిని గంటసేపు పైగా పావనంచేసిన తర్వాత బద్ధకంగా లేచాడు. చల్లబడిన ముఖాన్ని వేడినీళ్ళతో కడుక్కున్నాడు. ఆ ఇంటి ఇల్లాలు ఎంతో వినయంగా అందించిన లోటా కాఫీ నంజి నంజి తాగాడు.

అంత పని జరిగితే కానీ జేబులో కలానికి చలనం రాలేదు.

విలేజ్ అసిస్టెంటు చేతికి కలం రాగానే తన బావిలో గొట్టంబావి పడినంత సంబరపడ్డాడు గంగాధరం.

దరఖాస్తు ఫారంలో రాతకోతలు పూర్తి అయ్యాయి.

వంద రూపాయల్లో మందుకు విందుకు పోగా మిగిలింది విలేజ్ అసిస్టెంటు జేబులో చేరి చెమటలోనుంచి పుట్టిన తడిని తుడుచుకొనింది.

అతను చాలా మంచివాడు. 'నా పని నేను చేశాను. ఇంక నీతలపాడు నువ్వు పడుకో!" అని గంగాధరాన్ని విడిచిపెట్టలేదు. వెంట పెట్టుకొన్నాడు. రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ని దర్శించాడు. అప్పో సప్పో చేసి తాహత్తుకు తగిన ముడుపులు చెల్లించిన తర్వాతే దర్శనం దొరికింది. ఎవరికి చేరవలసినది వాళ్ళకు చేరాకనే, దరఖాస్తు ఫారం మండల కార్యాలయానికి చేరింది.

ఇదంతా జరిగేటప్పటికి రెండు వారాలు పట్టింది. గంగాధరం పట్టుబట్టి వీళ్ళందరి చుట్టూ తిరుగుతున్నాడే కాని రెండు వారాలు తిరిగిపోయాయన్న సంగతే గమనించలేదు. అప్పటికే చెరకు తోట మోసుల్లో వాడు పుట్టింది. అయినా గంగాధరం అధైర్యపడలేదు. మండలాధికారి తన పరిస్థితిని గమనిస్తాడనీ... జిల్లా అధికారులు కలుగజేసుకుంటారని... ఏకాఏకిన బయలుదేరి వస్తారనీ... ఎండిపోయిన బావిలో గొట్టంబాయి వేయిస్తాడనీ... తన పంట చేతికందుతుందనీ పగటి కలలు కంటూనే ఉన్నాడు.

ఇంతలో ఎన్జీవోలు మెరుపు సమ్మె ప్రకటించారు.

గంగాధరం గతి అగాధంలో దిక్కుతోచని స్థితిలో! కాలూ చెయ్యి ఆడలేదు. నడుములు విరిగాయి. నెత్తిన చేతులు పెట్టుకొని బావిగట్టున కుప్పగా కూలబడ్డాడు.

"చెప్పినమాట ఇనకుండా చెవులకు చెప్పులడిగే వాళ్ళగెతంతా ఇంతేరా గంగాధరం."

మోకాళ్ళసందున తలపెట్టి తనలోతాను కుమిలిపోతున్న గంగాధరం ఒక్కసారి తల పైకెత్తాడు.

ఎదురుగా ఎదిరింటి ఏకాంబరం. అదొక విధంగా చూస్తూ ఇంకొక విధంగా నవ్వుతున్నాడు. పుండుమీద కారం చల్లినట్లయింది. కడుపు భగ్గుమని మండినట్లయింది. ఒక్క ఊపులో పైకిలేచాడు.

"ఒరే ఏకాంబరం! ఈ మణుసులుండారే? ఉత్త పనికిమాలిన యదవల్రా! బతకతా ఉంటే చూడలేరు. చెడిపోతే చేరదీలేరు. నా చావేందో నేను చస్తా ఉండా. నడిమిద్దె నిన్నెవర్రా పిల్చింది." అన్నట్లుగా ఒక్క చూపు చూశాడు. గిరక్కున వెనక్కు తిరిగి పరుగందుకొన్నాడు.

"ఈడికి రేపోమాపో కచ్చితంగా పిచ్చి పట్టేది మాత్రం కాయం" అని ఏకాంబరం విరగబడి నవ్వుతున్నాడు.

గంగాధరం ఆ పరుగుమీదనే మండల కార్యాలయంలో అడుగుపెట్టాడు– లోకంలో దైన్యాన్నంతా ముఖానికి వేలాడకట్టుకొని.

ఆ మండల కార్యాలయం నిండు ముత్తైదు తాళి తెంచేసి తెల్లకోక కట్టుకున్నట్లుగా బోసిగా ఉంది. పరిస్థితికి పరితపిస్తున్నట్లుగా మండలాధికారి ఒక కుర్చీలో కూలబడ్డాడు దిక్కుతోచకుండా. ఏదో ఒక కొత్త ప్రపంచంలో అడుగుపెట్టినట్లు దిక్కులు చూస్తూ అడుగుమీద అడుగ్గా గంగాధరం ఆ గదిలో పిల్లితో పోటీపడ్డాడు.

చేతికి పనిలేదని ఒకరు...చేసిన శ్రమఫలితం చేతికి అందకుండా పోతున్నదనే బాధలో ఇంకొకరు. ఆ దిక్కులేని కార్యాలయంలో కలుసుకోవడం ఒక అపూర్వసంఘటన. దాదాపు ఏడుస్తున్నట్లుగా గంగాధరం వినిపించిన తన దీన పరిస్థితిని సిగరెట్టు మీద సిగరెట్టును ఒకపట్టు పట్టి పీలుస్తూ ఓపిగ్గా వినడం మరీ ఆశ్చర్యం. ఆ తర్వాత కాలుతున్న సిగరెట్టును వదిలిపెట్టి అన్నాడాయన–

"అష్టకష్టాలుపడి అయిదునెలలు కంటికి రెప్పలా కాపాడావా? ఎప్పుడూ ఎండిపోని బావి ఎండిపోయిందా? మూడెకరాల చెరకుతోట మోసుల్లో వాడు పుట్టిందా? అయ్యయ్యో! రైతన్నకు రారాని కష్టం వచ్చిపడిందే. ఆ తోటను చూస్తుంటే నీకు కాదు ఆ మాట వింటూ ఉంటే నాకే నిజంగా కడుపు తరుక్కొని పోతూఉంది? అయినా నన్నేంచెయ్యమంటావ్ చెప్పు? నాపని ఎంతవరకు రెకమెండ్ చేసి కలెక్టర్ ఆఫీసుకు పంపేవరకే కదా? ఆ ఫైలే నీ చేతికిస్తా. ఏం ప్రయోజనం? చూస్తున్నావ్ గదా? ఇక్కడ ఈ ఆఫీసు ఎలా పాడుగొట్టుకుంటూ ఉందో అక్కడ

కలెక్టర్ ఆఫీస్‌కూడా అలాగే ఏడుస్తూ ఉంటుంది." అంటూ ఏడుస్తూ రైకముడి విప్పినంతపని చేశాడు మండలాధికారి.

"అదీ నిజమే గదా?" అనుకుంటూ ఆ ఆఫీసులో నిలబడిన గంగాధరానికి దిక్కుతోచలేదు. అందుకే తల వంచాడు. వంచిన తలెత్తకుండా నడుస్తున్నాడు. నడుస్తున్న దారి కనిపించడంలేదు. ఈ పొద్దో రేపో పడుకుంటే పైకి లేవలేని దాపటెద్దు దైన్యంగా కనిపిస్తూ ఉంది. ఇరుసు విరిగి చింతమానికిందపడి చెదలు పడుతున్న రెండెద్దుల బండి కనిపిస్తూ ఉంది. చాలీచాలని నీళ్ళను నమ్ముకొని చెరుకెందుకేస్తావే అని హెచ్చరించిన ఇల్లాలు కనిపిస్తూఉంది.

అన్నిటినీ పక్కకు నెట్టి గంగాధరం నేరుగా చింతమాని కిందికే నడిచాడు. వెంకటాచలం ముందు తలవంచాడు తిరిగి తిరిగి అరిగిపోయిన పాదాల పలకలమీద మొలకెత్తిన బాధల అక్షరాల్ని చదువుకోమన్నట్లుగా! కాసేపు నిశ్శబ్దం కమ్ముకొనింది. వెంకటాచలం గుండె నీరయింది.

"గంగాధరం! నీ బాధ నాకు తెలుసు. అయినా ఏం చేస్తాం చెప్పు? నువ్వు చేయవలసిన ప్రయత్నాలన్నీ చేశావు. చేస్తున్నావు. కలిసిరానపుడు ఎవరు మాత్రం ఏం చేస్తారు? అయినా ఈ సమ్మె ఎంతకాలమని కొనసాగుతుంది? యంత్రాంగం లేకుండా ప్రభుత్వం నడవదు. జీతాలు అందకపోతే ఉద్యోగులకు పూట గడవదు. సంప్రదింపులు జరుగుతున్నాయి. ఏదో ఒక విధంగా ఒడంబడిక కుదురుతుంది. సమ్మె త్వరలో ముగుస్తుంది. నీ ప్రయత్నం తప్పకుండా నెరవేరుతుంది." అని వెంకటాచలం ధైర్యం చెబుతాడు.

వింటున్నంతసేపూ మనసు బాగానే ఉంటుంది. కొంత కుదుటపడుతుంది కూడా. కానీ మోసులు ఎండిపోతున్న చెరకుతోట కండ్లముందు మెదిల్తే గుండెమైదానంలో నైరాశ్యం ముండ్ల జెముడు నాల్కలు చాస్తుంది. అయినా ఏం చేస్తాడు?

నిద్రలేచి లేవడంతో కండ్లు నులుముకుంటూ వెళ్ళేది. మోసుల్లో మొదలుపెట్టి కొంచెం కొంచెంగా ఎండిపోతున్న చెరకు తోటను చూడలేక గిరక్కున వెనక్కు తిరిగేది. వంచిన తలెత్తకుండా చింతమాని కిందికి వెళ్ళేది. "ఈ పొద్దో రేపో తేలిపోయేటట్లుగా ఉంది గంగాధరం" అని వెంకటాచలం అంటే చెవులు వాలేసుకొని ఇంటి ముఖం పట్టేది గంగాధరం దినచర్య అయింది.

ఎవరి చేతిలో అయినా దినపత్రిక కనిపిస్తే చాలు. గంగాధరం అతడి దగ్గరికి పరుగులమీద పోతాడు. "అయ్యా! అయ్యా! సమ్మె ఏమయిందయ్యా?" అని అడుగుతాడు.

"ఇప్పుడిప్పుడే అదేమీ తేలేటట్టుగా లేదే?" అని అంటే ఆ మాట చెవుల్లో సీసం కరిగించి పోసినట్లు!

నిరాశనిస్పృహలు తన జీవితానికి తారాస్థాయి సంగీతమై గంగాధరానికి కాలం నిలిచిపోయినట్లనిపిస్తుంది. కానీ కాలం ఒక ఇంద్రజాలం. దినాలు గడిచాయి. వారాలు

గడిచాయి. నెల తిరిగింది. చెరకు తోటలో మోసులు ఎండిపోతున్నాయి. సమ్మె ఒక కొలిక్కి వచ్చే మార్గమే కనిపించలేదు. గంగాధరం సజీవంగా మూలుగుతున్న ఆశలకు సమాధి కట్టాడు. తిండీ తిప్పలు మాని కొంపలో ముసుగుదన్ని పడుకొన్నాడు.

"ఇచ్చిత్రానికి ఇద్దురుచస్తే ఏడవలేక ముగ్గురు చచ్చినట్టుండాదే యవ్వారం. ఇట్టవుతుందని ముందుగా నీకేఁవన్నా వాసనగొట్టిందా? చెయ్యాల్సిందంతా చేస్తివిగదా? చెయ్యి జారిపోతే ఎవురు మాత్రం ఏంచేస్తారు? పోనీ, ఎల్లకాలం ఇట్లానే ఉండబోతిందా? వానలు కురవకుండా బోతాయా? ఈ పంటపోతే పాయింది. ఇంకొక పంట చేతికి అందకుండా పోతిందా? తిండీ నీళ్ళు లేకుండా నువ్విట్టా ముసుగుదన్ని పొణుకుంటే మొదిటికే మోసమైతే మల్లా నాగతేం కావాల్రా దేవుడో?" అంటూ పాపం! ఆ ఇల్లాలు నెత్తీనోరూ మొత్తుకున్నా అతగాడికి చీమ కుట్టినట్లనిపించలేదు.

"ఈ ఎర్రికి నేనేడపాయ్ తెచ్చేది మొందు. ఇంక ఆ అయ్యోరే గెతి" అని ఇంటామె ఇల్లా వాకిలీ ఒకటయ్యేట్లు ఏడుస్తూ ఉంటే–

"సమ్మె ముగిసిందయ్యా గంగాధరం!" అంటూ వెంకటాచలమే గంగాధరాన్ని వెదుక్కొంటూ వచ్చాడు.

ఎగిరిపడి లేచాడు గంగాధరం. "అయ్యోరా! ఇంకొక జల్మలో అయినా నీ కడుపున పుట్టి ఋణం తీరస్తాలే". అంటూ పరుగందుకొన్నాడు. ఆ పరుగు పరుగు మండల కార్యాలయంలో అడుగుపెట్టడంతో ఆగింది.

అయితే అక్కడ పరిస్థితి గమనించి కొయ్యబారిపోయాడు.

ఆ ఆఫీసులో పనిచేస్తున్న ఏడెనిమిది మంది ఎన్జీవోలు రెండు వర్గాలుగా చీలారు. వాళ్ళల్లోవాళ్ళు వాదులాడుకుంటున్నారు. నెలరోజులుగా మూతపడిన ఆఫీసు మీద పడుతున్న వాళ్ళను వాళ్ళు పట్టించుకోవడమేలేదు. గంగాధరం నేరుగా మండలాధికారి గదిలోకి వెళ్ళాడు తొలిపరిచయాన్ని నెమరేసుకుంటూ.

కొంచెం కొంచెంగా గంగాధరం గుండెలా కాలుతున్న సిగరెట్టు పొగతో ఆడుకుంటున్నాడు మండలాధికారి. గంగాధరం గదిలో అడుగుపెట్టడంతో ఆ ఆటకు భంగం కలిగినట్లుంది. మనసులో పుట్టిన చికాకు క్రమంగా పైకిపాకి ముఖంలో చోటు చేసుకొనింది. గంగాధరం ఇదంతా గమనించే స్థితిలో లేడు. మండలాధికారిని చూస్తూనే రెండుచేతులెత్తి నమస్కరించాడు. ఆ చేతులను దించి కట్టుకున్నాడు. వొదిగి వొదిగి నిలబడ్డాడు.

"ఎవరు నువ్వు? ఎందుకు నా గదిలో అడుగుపెట్టావ్?" అన్నట్లుగా అధికారదర్పం అదే తనపద్ధతి అన్నట్లుగా ఒక్కచూపు విసిరింది.

గంగాధరం నీరుకారిపోయాడు. ఎప్పుడో రెండురోజుల కిందట ఇంటి ఇల్లాలు పట్టుబలవంతంగా పెట్టిన అరముద్ద సంకటి... పేగులు అరుస్తున్నాయి. పెదాలు తడారి

పిడచగట్టుకు పోతున్నాయి. చిరకాలం జబ్బుపడిన మనిషి మాట్లాడడానికి ప్రయత్నించినట్లుగా "అడుగంటినబాయి... ఎండిపోతున్న చెరుకు తోట... బాయిలో గొట్టం బాయి..." అంటూ గొణిగాడు.

ఆ గొణుగుడు విని ఆ గది ప్రతిధ్వనించేటట్లుగా నవ్వాడు మండలాధికారి. నవ్వి నవ్వి ఆ నవ్వును ఆపుకోవడానికి గట్టి ప్రయత్నమే చేశాడు. అప్పుడు ఒక మహావేదాంతిలా–

"ఒరే పిచ్చోడా! ఈ లోకంలో ఎవరి పిచ్చి వాళ్ళకానందం– నీ పిచ్చి నీకు ఆనంద మయినట్లు. అవునా కాదా చెప్పు. అవును కాబట్టే! ఎన్జీవోల్లో ఒక వర్గం డ్యూటీలో చేరాలని... ఇంకొక వర్గం తమ నాయకుల ద్వారా ఏదో తీరని అన్యాయం జరిగిపోయింది కాబట్టి డ్యూటీలో చేరకూడదని వాదులాడుకొంటున్నారు. వాళ్ళగోడు వాళ్ళది. నీ గోడు నీది. అవునా? అయితే వినే వాళ్ళెవరు? కాబట్టి ఈ ఒక్కపూట నీకు నీవే వాయిదా వేసుకో. రేపు రా చూద్దాం" అంటూ మండలాధికారి సిగరెట్టు పొగ వలయాలు వలయాలుగా వదులుతూ అందులో కనిపించని అందాలు వెదుక్కొంటున్నాడు.

"ఫైల్‌చేతికే ఇస్తానన్న పెద్దమనిషి ఇతడేనా?" అని ఆశ్చర్యపడ్తూ గంగాధరం అటు ఇటూ కలదలేక నిలబడ్డాడు–అధికారిని రెప్పార్పకుండా చూస్తూ!

"ఏమిటాచూపు? ఎందుకలా నిలబడ్డావ్? చెప్పింది అర్థం కాలేదా? పోనీ... ఏ భాషలో చెప్పమంటావో చెప్పు?"

మండలాధికారి ఎకసక్కెం ఏడు బండ్లకెత్తినా ఇంకా కొంత మిగిలుతుందేమో?

తిరగబడితే కొన్ని సందర్భాల్లో పిల్లి కూడా పులి అవుతుంది. గంగాధరానికి కోపం వచ్చింది. అయితే ఫలితాన్ని సాధించలేని కోపం నిష్ప్రయోజనమని అతడికి తెలుసు. అందుకే పరుగుల మీద వచ్చినవాడు అడుగుమీద అడుగ్గా అడుగుకొక్క ఆలోచనగా ఇల్లు చేరాడు.

అడుగంటిన బావిని... మోసులు ఎండిపోతున్న చెరకుతోటను... మార్చి మార్చి చూస్తూ... బావిగట్టున కూర్చున్న గంగాధరం ఆ రోజు పొద్దును చూస్తున్నాడు. ఆపొద్దు ఎప్పుడు పోతుందో... పోయిన పొద్దు ఎప్పుడు మొలుస్తుందో అని!

ఆ మరుసటి రోజు పొద్దుతో పోటీపడ్తూ బయలుదేరి మండలాఫీసుకు చేరాడు.

ఆ రోజు ఎన్జీవోలు డ్యూటీలో చేరారు. విషాదం మబ్బుకమ్మిన గంగాధరం కండ్లు ఒక్కసారిగా కాంతవంతమయ్యాయి. అయితే ఆ దినమంతా నెలరోజులుగా దుమ్మునిండిన కుర్చీలను మేజాలను బీరువాల్లో ఫైళ్ళను దుమ్ముదులిపే కార్యక్రమానికే పరిమితమయ్యారు ఎన్జీవోలు.

గంగాధరం అదేమీ పట్టించుకోలేదు. "అయ్యా మూడెకరాల చెరకుతోట... మోసులు ఎండిపోతా ఉండాయి. బాయి అడుగంటిపొయ్యింది... ఆ బాయిలో గొట్టంబాయి!"

దాదాపు ఏడుస్తున్నట్లుగా ఆఫీసులో నిలబడి చేతులెత్తి దండం పెట్టాడు.

"ఈ దుమ్మయినా దులుపుకోనిస్తారా లేదా మమ్మల్ని? అప్పుడే మా దుంపతెంచేదానికి తయారయ్యారే! ఇప్పుడేం కొంపలు మునిగిపోతున్నాయి?" అని అంటూ అందరూ కలిసి గంగాధరాన్ని పట్టుకొని దుమ్ము దులిపారు.

ఆ దెబ్బతో గంగాధరం తల దిమ్మతిరిగింది.

అదీ నిజమే గదా! ఒకడి తొందర ఇంకొకడికి బాధే గదా?... అని ఆలోచించగా ఆలోచించగా గంగాధరానికి తెలివి వచ్చింది. ఆ మరుసటి రోజుకు తనకు తానుగా వాయిదా వేసుకొన్నాడు. ఇల్లు చేరాడు.

ఆరోజు గడవడం గండం గడిచి పిండం బయటపడినంతపని అయింది.

ఆ రాత్రి ఇల్లాలు శతపోరితే అంత ఎంగిలిపడ్డాడు. నడవలో నులక మంచం మీద నడుం వాల్చాడు. మానసికంగా శారీరకంగా అలసిన శరీరం. నిద్రలోకి చల్లగా జారుకొనింది. ఆ నిద్రలో కల.... మండలాధికారి సంతకంచేసి ఫైల్ తన చేతికే ఇచ్చినట్లు... పరుగులమీద తాను కలెక్టర్ ఆఫీసుకువెళ్ళి ఆ ఫైలును అందజేసినట్లు...వాళ్ళు ఎకాఎకిన బయలుదేరి వచ్చి బావిలో బోర్ వేస్తున్నట్లు!...

తెల్లారింది. గంగాధరం చాలా తెంపుగా నిద్రలేచాడు. స్నానం చేశాడు. నట్టింట దేవుడికి పూజా పునస్కారాలు చేశాడు. ముత్తైదు భార్యను ఎదురుగా రమ్మని తానే చెప్పి మంచి శకునమనుకొంటూ మండలాఫీసుకు బయలుదేరాడు.

ఆ ఆఫీసులో ఒక గుమస్తా కుర్చీనిండుగా కూర్చున్నాడు. మనస్సులో ఎక్కడో పెట్టిన సందేహానికి సమాధానం చెప్పాలని చూపులతో వెదుక్కుంటున్నాడు. గంగాధరం అతడికి చేతులెత్తి దండం పెట్టి తన గోడు వినిపించాడు. అతడు కూడా పాపం! గంగాధరం చెప్పినదంతా శ్రద్ధగా విన్నాడు. విని, ఇంకొక కుర్చీని చూపించాడు. అది ఖాళీ కుర్చీ. ఆ కుర్చీని గంగాధరం దేబెరించి చూస్తూ ఉంటే–

"పో పో! ఆ కుర్చీ దగ్గరికి పో. అక్కడ నిలబడు. ఆ కుర్చీలో కూర్చొనే గుమాస్తా వస్తాడు. నాతో చెప్పినట్లు అతడికి చెప్పు" అని చాలా నెమ్మదిగా చెప్పాడా గుమాస్తా.

గంగాధరం ఆ కుర్చీ దగ్గరికి వెళ్ళాడు. ఆ కుర్చీ పక్కన చేతులు కట్టుకొని నిలబడ్డాడు. నిలబడి ఆఫీసువాకిలిని ఖాళీ కుర్చీని మార్చి మార్చి చూస్తూ ఉంటే ఆ గుమస్తా రానే వచ్చాడు. తనకు స్వాగతం పలకడానికన్నట్లుగా నిలబడి ఉన్న గంగాధరాన్ని ఎగాదిగా చూశాడు. నొసలు చిట్లించాడు. చూపుల్తో ఈసడిస్తూ తల ఎగరేశాడు. దర్జాగా కుర్చీలో కూర్చున్నాడు. నములుతున్న కిళ్ళీని నాలుకతో ఒక దవడ పక్కకు నెట్టుకొని "నీ ఏడుపేదో ఏడువు" అన్నాడు.

గంగాధరం నిజంగానే ఏడ్చాడు.

"రైతు సోదరా! మీరు దేశానికి వెన్నెముకలని ప్రభుత్వం చెప్తూ ఉంది. అంటే ఒక శరీరంలో వెన్నెముక ఎంత ముఖ్యమో ఒక ప్రభుత్వానికి మీరూ అంత ముఖ్యమన్న మాట. అటువంటి

మీరు ఎన్నుకొన్న ప్రభుత్వం ఏమని చెప్తున్నదంటే? ...సమ్మె కాలంలో మీరు పనిచేయలేదు. కాబట్టి మీకు జీతాలు ఇవ్వం" అంటున్నది. "జీతాలు ఇవ్వనప్పుడు మేమెందుకు పనిచేయాలి? అని మేమంటున్నాం. న్యాయం అవునా? కాదా? నువ్వే చెప్పు. నువ్వు రైతువి. ఒక కూలోణ్ణి పెట్టుకుంటావ్. కూలిస్తేనే కదా వాడు పనిచేస్తాడు. అవునా? కాదా? అవును కాబట్టే న్యాయం కూడా అదేకాబట్టి ఇప్పుడు నువ్వేం చెయ్యాలంటే వెంటనే బయల్దేరు నీతోటి రైతుసోదరులను కూడగట్టుకోవాలి. వెళ్ళి ప్రభుత్వంతో చెప్పాలి. అవసరమైతే ధర్నాలు చేయాలి. అక్కడికీ లొంగకపోతే ఆత్మహత్యలు చేసుకుంటామని బెదిరించాలి. అలా చేసి మా సమ్మెకాలం జీతాలు మాకిప్పించండి. మీ పనులు మేం తలకెత్తుకొని చేస్తాం."

గుమాస్తా ఎకసెక్కం చురకత్తిలా గుండెల్లో దిగితే నెత్తురు పులుముకొన్న ఆవేశం... ఆ గుండెల్లోనే గూడు కట్టుకొన్న బాధ... కలగలిసి ఆక్షణంవరకు తన్ను పరీక్షించిన ఓర్పును మింగేస్తే– గంగాధరంపిల్లి పులిఅయింది.

ఆ పులి గాండ్రించింది– గుమాస్తాను చూస్తూ.

అది గాండ్రిపు కాదు– వికటాట్టహాసం!

ఊహించని పరిణామంతో ఆఫీసు ఉలిక్కిపడింది. కనుబొమ ముడిపడ్డే గంగాధరాన్ని నిలువునా కాల్చేసే చూపు!

అదేమీ పట్టించుకొనే స్థితిలో లేదు గంగాధరం. అమాంతంగా మింగేసేటట్టు ఆ గుమాస్తాను చూస్తూ–

"దేవరా! ఎంతబాగా ఆలోచించినారు. ఎంతమంచిమాట చెప్పినారు. నిజంవేగదా? కూలోడికి కూలియ్యకుండా పనిచెయ్మంటే వాడికేంగాదా? మీరుగూడా అంతేకదా? అందుకే ఇప్పుడే ఎలబార్తాఉండా. ఊరూరూ తిరగతా. తొక్కని గడప లేదంటూ తొక్కతా. రైతులందర్ని కూడగడ్తా! ఎందుకు? మీకు జీతాలియ్యమని గ్రెబుత్వంతో చెప్పేదానికి కాదు. మీ పెండ్లాల తాళ్ళు తెంపేదానికి!"

పండ్లు పటపట కొరుకుతూ పరుగందుకొన్నాడు గంగాధరం!

ఆఫీసులో అధికారం చిందులు తొక్కుతూఉంది!

చేతికందిన పైరు నోటికందని స్థితిలో గంగాధరానికే కాదు ఏ రైతుకైనా ఆత్మహత్యే శరణ్యం.

అయితే గంగాధరం రాయలసీమలో రైతు! ●

విపుల
(1, నవంబర్ 1998)